పల్లె ప్రగతితో మౌలిక సదుపాయాలు

- రాజకీయాలు ఎన్నికల వరకే ఉండాలి
- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల రూరల్, జనవరి 30: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం లో పల్లె ప్రగతితో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించామని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. లక్ష్మీపూర్ గ్రామంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.3.50 లక్షలతో నిర్మించనున్న ప్రహరీ, సీడీపీ నిధులు రూ.6 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి, గంగమ్మ ఆలయం వద్ద రూ.7 లక్షలతో బతుకమ్మ ఘాట్, సీసీ రోడ్డు నిర్మాణానికి సంజయ్ కుమార్, జడ్పీ చైర్మన్ దావ వసంతలు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, లక్ష్మీపూర్ గ్రామంలో రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు చేసుకున్నామని, ఇంత పెద్ద మొత్తంగా గ్రామాలకు గతంలో నిధులు కేటాయింపు జరగలేదన్నారు. సీడ్ ప్రాసెస్ యూనిట్ పనులు దాదాపు పూర్తి కావచ్చిందని, రైతులకు చాలా ఉపయోగమని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో ప్రతి వేసవిలో చెరువులు జలకళను సంతరించుకున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నేడు చెరువులు వెలవెల బోతున్నాయన్నారు. రాజకీయాలు ఎన్నికల వరకే అని, అభివృద్ధి, సంక్షేమమమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. వరద కాలువను ఉపయోగించి కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా తెలంగాణ సస్యశ్యామలం అయిందని, ఎస్సారెస్పీ నీరు ఇతర ప్రాంతాలకు మళ్లించి జగిత్యాల నియోజకవర్గ చిట్ట చివరి గ్రామాలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. జడ్పీ చైర్పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, ఆదర్శవంతమైన రైతులు ఉన్న గ్రామం లక్ష్మీ పూర్ అని, మిషన్ కాకతీయ కార్యక్రమంతో భూగర్భ జలాలు పెరిగాయన్నారు. అధికారంలోకి రాకముందు ప్రజలకు మార్పు తీసుకొస్తామని చెప్పిన కాంగ్రెస్, నేడు కరెంట్ కోతలతో మార్పు తెస్తున్నదని అని ఎద్దేవా చేశారు. పంట పొలాలు నేడు బీడుగా మారే పరిస్థితి వచ్చిందని, 420 హామీలను ఎలా అమలు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చెరుకు జాన్, ఎంపీటీసీ సునీత-లక్ష్మణ్, ఉప సర్పంచ్ రఘు, పార్టీ మండలాధ్యక్షుడు బాల ముకుందం, గ్రామ శాఖ అధ్యక్షుడు సత్తి రెడ్డి, ఆత్మ చైర్మన్ రాజిరెడ్డి, ఎంపీడీవో రాజేశ్వరి, ఏఈ రాజమల్లయ్య, ఎంపీవో రవి బాబు, నాయకులు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, జడ్పీ చైర్పర్సన్

జీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

వెల్గటూర్, జనవరి 30: కాంగ్రెస్ పార్టీ ప్రజకు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను అమలు చేస్తుందని ప్రభుత్వం విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన జీపీ భవనాన్ని సర్పంచ్ మేర్గు మురళితో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. అంతకుముందు ప్రభుత్వం ద్వారా బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ పొందిన యువతకు పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కునమల్ల లక్ష్మి, జడ్పీటీసీ సుధారాణి, ఎంపీటీసీ పెద్దూరి హారిక-భరత్‌కుమార్, ఉప సర్పంచ్ గుండా టి సందీప్‌రెడ్డి, తహసీల్దార్ శేఖర్, ఎంపీడీవో ఆకుల సంజీవరావు, ఏఈ రాజ్‌కుమా ర్, మండల విద్యాధికారి బత్తుల భూమ య్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

పెగడపల్లి, జనవరి 30: ఏడుమోటలపల్లిలో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, ఐతుపల్లిలో రూ.25 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం, ఖబ్రస్తాన్, నందగిరిలో నూతనంగా నిర్మించిన వీరభద్రస్వామి ముఖద్వారం, ఖబ్రస్తాన్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పుల్లయ్య, ఎంపీవో మహేందర్, ఏఈ శంషేర్, సర్పంచులు రవినాయక్, కొండయ్య, రాకేశ్, వైస్ ఎంపీపీ గంగాధర్, ఎంపీటీసీ అంజయ్య, కో-ఆప్షన్ సభ్యుడు రహీం, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాములుగౌడ్ తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ధర్మపురి రూరల్, జనవరి 30: బూరుగుపల్లి వద్ద జాతీయ రహదారిపై ఆటో నుంచి జారిపడి ధర్మపురికి చెందిన మ్యాన సంతోష్ (30) మృతి చెందాడు. ఎస్ఐ దత్తాద్రి తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మపురికి చెందిన సంతోష్ వెల్గటూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే మంగళవారం ధర్మపురి నుంచి ఆటోలో వెల్గటూర్‌కు వెళ్తుండగా డ్రైవర్ రాందేని గణేశ్ అతివేగంగా నడిపి సడన్‌గా బ్రేక్ వేయడంతో ఆటో కుదుపుకు గురైంది. దీంతో ఆటోలో ఉన్న సంతోష్ కిందపడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం కరీంనగర్‌లోని దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

జగిత్యాల, జనవరి 30: రానున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని విద్యార్థులు, అధ్యాపకులకు ఇంటర్‌విద్య జిల్లా నోడల్ అధికారి బొప్పరాతి నారాయణ సూచించారు. జగిత్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన కళాశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ ఆలియా మక్సుద్, లెక్చరర్లు సమీనా, రుమానా, లైబ్రేరియన్ సంపత్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి తిరుపతిరెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్‌కు నివాళి

జగిత్యాల, జనవరి 30: జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత వద్ద డ్రైవర్‌గా పని చేసిన మోహిజ్ ఇటీవల కరీంనగర్‌లో రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ మృతి చెందాడు. జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిషత్ సభ్యులు, సిబ్బందితో కలిసి మోహిజ్ చిత్రపటానికి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో రఘువరణ్, జడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు, జడ్పీటీసీలు జలేందర్, మనోహర్ రెడ్డి, పద్మ, భూమయ్య జిల్లా పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ నియంతృత్వ విధానం వీడనాడాలి

- యాదాద్రి జడ్పీ చైర్మన్‌కు క్షమాపణలు చెప్పాలని డిమాండ్
- జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

మాట్లాడుతున్న దావ వసంత

జగిత్యాల, జనవరి 30: యాదాద్రి భువనగిరి జిల్లా జడ్పీ చైర్మన్ సందీప్ రెడ్డిపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారిక కార్యక్రమంలో అకారణంగా దుర్భాషాలాడడం, ఆయనపై దాడికి దిగడం కాంగ్రెస్ పార్టీ నియంతృత్వ పాలనకు నిదర్శనమని జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. జిల్లా కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ, సందీప్ రెడ్డిపై దాడిని బీఆర్ఎస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇటీవల రైతు బంధు రాలేదంటే చెప్పుతో కొట్టాలన్న మంత్రి కోమటిరెడ్డి, ఏకంగా డిప్యూటీ క్యాబినెట్ హోదా కలిగిన జడ్పీ చైర్మన్‌ను వేదికపై నుంచి తీసుకెళ్లాలని పోలీసులకు హుకూం జారీ చేయడం దారుణమన్నారు. ప్రజాస్వామ్యంపై ఏ మాత్రం విశ్వాసం, గౌరవం ఉన్నా జడ్పీ చైర్మన్‌కు భేషరతుగా కోమటి రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర అధ్యక్షుడిగా మాధవాచార్యులు

కథలాపూర్, జనవరి 30: గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన అర్చకుడు ఓరుగంటి మాధవాచార్యులు అర్చక సంఘం క్రమశిక్షణా సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు దూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవ శర్మ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మాధవాచార్యులు ప్రస్తుతం జిల్లా అధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు. మాధవాచార్యుల నియామకంపై అర్చకులు సంతోషం వ్యక్తం చేశారు.

ఆపరేటర్లపై డీఎల్‌పీవో ఆగ్రహం

కొడిమ్యాల, జనవరి 30: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కంప్యూటర్ ఆపరేటర్లపై డీఎల్‌పీవో శంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జీపీలో సంవత్సరం పాటు జరిగే అభివృద్ధి పనులను కంప్యూటర్‌లో నమోదు చేయకపోవడంపై మండిపడ్డారు.

జీపీ సిబ్బందికి సన్మానం

కొడిమ్యాల, జనవరి 30: తిప్పాయిపల్లి గ్రామ పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బందిని సర్పంచ్ మ్యాకల లత-మల్లేశం శాలువాతో మంగళవారం సన్మానించారు. ఫిబ్రవరి 1న సర్పంచుల పదవీ కాలం పూర్తవుతున్న సందర్భంగా శాలువాతో సన్మానించారు.

కువైట్‌లో పెగడపల్లి వాసి మృతి

పెగడపల్లి, జనవరి 30: కువైట్‌లో మండల కేంద్రానికి చెందిన బైర శ్రీనివాస్(48) గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. జీవనోపాధి నిమిత్తం మూడేండ్ల క్రితం కువైట్ వెళ్లిన శ్రీనివాస్‌కు ఈనెల 26న గుండె పోటు రావడంతో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చెప్పారు.

బీమా చెక్కు అందజేత

ధర్మపురి, జనవరి 30: కేడీసీసీ బ్యాంకు ఖాతాదారు, ధర్మపురి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సభ్యుడైన జనిక రాంరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి బీమా పథకం కింద మంజూరైన రూ.2 లక్షల విలువైన చెక్కును నామినీ రాంరెడ్డి భార్య సునీతకు డీసీఎమ్మెస్ చైర్మన్ డాక్టర్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ శ్రీలక్ష్మి, పీఏసీఎస్ సీఈవో రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకోవాలి

జగిత్యాల, జనవరి 30: మెట్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావుపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ యాస్మిన్ బాషాకు ఎస్ఎఫ్ఐ మంగళవారం ఫిర్యాదు చేసింది. కొన్ని రోజులుగా పాఠశాల విద్యార్థులకు తాగునీరు, మరుగు దొడ్లను వాడనీయడంలేదని, ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా అధ్యక్షురాలు సౌందర్య అన్నారు.

ఇన్‌చార్జి ఈవోగా అనూష

కొడిమ్యాల, జనవరి 30: నల్లగొండ శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా సారంగాపూర్ మండలం పెంబట్ల దుబ్బ రాజేశ్వర స్వామి ఈవో అనూష మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. కార్యక్రమంలో గతంలో ఈవోగా విధులు నిర్వహించిన కోస్న కాంతారెడ్డి, అర్చకులు శ్రీనివాస్, మనోజ్ పాల్గొన్నారు.

కార్మికుల సమ్మె నోటీస్

జగిత్యాల, జనవరి 30: ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా జరిగే కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్‌లో పాల్గొంటామని ఏఐటీయూసీ అనుబంధ మధ్యాహ్న భోజన వర్క ర్స్ యూనియన్ జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషాకు, విద్యాధికారికి సమ్మె నోటీస్ ఇచ్చారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజాకార్మిక రైతు వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా జాయింట్ ప్లాట్ ఫాం ఆఫ్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూ సీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుతారి రాములు, ఎండీ ముక్రం తెలిపారు.

వరి, మిర్చి పంటల పరిశీలన

కోరుట్ల రూరల్/ జగిత్యాల టౌన్/ ఇబ్రహీంపట్నం, జనవరి 30: సంగెం, నాగులపేట, చిన్నమెట్‌పల్లి గ్రామాల్లో వరి, మిర్చి పంటను ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు, ఏవో నాగమణితో కలిసి మంగళవారం పరిశీలించారు. వర్షకొండ ఏవో దీపిక, హబ్సీపూర్ ఏఈవో ఏ సంధ్య పరిశీలించారు. వరిలో కాండం తొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు గోన్యానాయక్, బలరాం, రవి, ఏఈవోలు నరేశ్, సంధ్య, సర్పంచులు భాస్కర్‌రెడ్డి, నర్సయ్య, గంగరాజు ఉన్నారు.

ఐకేపీ ఉద్యోగులకు శిక్షణ

మేడిపల్లి, జనవరి 30: మండలకేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మంగళవారం లోకోస్‌పై ఐకేపీ ఉద్యోగులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. డీఆర్డీవో సుధీర్ హాజరై ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ట్రైనర్ రాజేంద్రప్రసాద్, ఏపీఎం గట్ల అశోక్, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

WANTED

★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. 9640468899 / 9640258899.
NT-319428-All

LOST DOCUMENT

పోల్సాని తిరుపతిరావు S/o. గోపాల్‌రావు, H.No. 2-50, గ్రా॥ నగురం, మం॥ జమ్మికుంట నుండి జమ్మికుంట పట్టణానికి వస్తుండగా మార్గమధ్యలో డాక్యుమెంట్ నెం. 2488/2011 గల ఒరిజినల్ కాపీ పడిపోయినది. దొరికిన వారు సంప్ర॥ 87906 00055

CHANGE OF NAME

★ I, GORITYALA SRIVANI, W/o. Venkata Kishan, R/o. 8-3-308/A/1, Ramchandrapur Colony, Karimnagar, TS. Changed My Name as GORITYALA SREEVANI, W/o. Venkata Kishan.
NT-319680

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గాంధీ సిద్ధాంతాలు స్ఫూర్తిదాయకం

గాంధీ వర్ధంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లు

కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

జగిత్యాల కలెక్టరేట్, జనవరి 30: మహాత్మా గాంధీ సిద్ధాంతాలు పాలకులకు, ప్రజలకు స్ఫూర్తిదాయమని, ప్రపంచ దేశాలకు అనుసరనీయమని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని జగిత్యాల కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, అడిషనల్ కలెక్టర్లు బీఎస్ లత, టీఎస్ దివాకర, వివిధ శాఖల అధికారులు మౌనం పాటించి గాంధీకి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సత్యం, ధర్మం, అహింస సిద్ధాంతాలతో దేశాన్ని ఏకతాటిపైకి తీసుకువచ్చి దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించారన్నారు. గాంధీ సేవలకు గాంధీ జన్మదినమైన అక్టోబర్ 2న అంతర్జాతీయ అహింసా దినోత్సవంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించడం భారతీయలకు ఎంతో గర్వకారణమన్నారు. ఇక్కడ ఎస్సీ కార్పొరేషన్ ఈడీ లక్ష్మీనారాయణ, కలెక్టరేట్ ఏవో హన్మంతరావు, అధికారులు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డును రద్దు చేయాలి

- సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా
- అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్, ఆర్డీవోకు వినతి

మెట్‌పల్లి, జనవరి 30: మేడిపల్లి, బండలింగాపూర్, వెల్లుల్ల గ్రామాల శివారుగా మీదుగా నిర్మించనున్న 63వ జాతీయ రహదారికి సంబంధించి బైపాస్ రోడ్డును వెంటనే రద్దు చేయాలని భూములు కోల్పోతున్న రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయా గ్రామాలకు చెందిన భూ నిర్వాసితులు మెట్‌పల్లి సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. బైపాస్ రోడ్డు కోసం పచ్చని పంట పొలాలతో కూడిన విలువైన భూములను కోల్పోవాల్సి వస్తుందని, బహిరంగ మార్కెట్‌లో పలుకుతున్న ధరకు, రిజిస్ట్రేషన్ ధరకు ఏ మాత్రం పొంతన లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. భూముల కోల్పోయే రైతులకు ప్రత్యామ్నాయ భూములు, ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని, భూ నిర్వాసితులకు పరిహారం బహిరంగ మార్కెట్‌కు అనుగుణంగా ధరను చెల్లించాలని లేదా ప్రస్తుతం ఉన్న అలైన్‌మెంట్‌ను మార్చి భూసేకరణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సంబంధిత అధికారులకు అందజేశారు. అంతకు ముందు ఆర్డీవో మధు భూ నిర్వాసితులతో మాట్లాడారు. భూ సేకరణకు సహకరించాలని కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

జగిత్యాల టవర్ సర్కిల్, జనవరి 30: జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా బుధవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ అధికారులు ఏఈ వీ సంతోష్ కుమార్ తెలిపారు. జగిత్యాల టౌన్-2 పరిధిలో తహసీల్ చౌరస్తా, పాత బస్టాండ్, అన్నపూర్ణ చౌరస్తా, పోచమ్మవాడ, బ్రాహ్మణవాడ, విద్యానగర్, ఎస్‌కేఎన్ఆర్ డిగ్రీ కళాశాల, రాజీవ్ గాంధీ చౌరస్తా, ధర్మపురి బైపాస్ రోడ్, గాయత్రి దేవాలయం ప్రాంతం, గొల్లపల్లి రోడ్, విజయపురి, దయాల్ నగర్, బైపాస్ రోడ్, సీతారాం నగర్ కాలనీ, బుక్కవాడ, శివ వీధి, టవర్ సర్కిల్, గంజ్ వీధి, కొత్తవాడ, భీరయ్య ఆలయ ప్రాంతం, శంకులపల్లి, కొత్త వాడ, హనుమాన్‌వాడ, సుతారిపేట, మిషన్ కాంపౌండ్, ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

మెట్‌పల్లి : జెండా ఊపి పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

మెట్‌పల్లి, జనవరి 30 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ మినీ స్టేడియంలో అథ్లెటిక్స్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి టోర్నీకి అండర్-8,10,12,14 విభాగాల బాలబాలికల ఎంపిక పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. గెలుపొందిన వారికి మెడల్స్, ప్రశంసాపత్రాలను అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్య రెడ్డి చేతుల మీదుగా ప్రదానం చేశారు. పోటీలకు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన 980 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ ఆల్‌రౌండర్ గంగాధర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లింగంపల్లి సంజీవ్, గజెల్లి రాందాస్, మహర్షి, కొమురయ్య, అంజయ్య, కార్తీక్, సాత్విక, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగికదాడి

ధర్మపురి, జనవరి 30 : ధర్మపురి పట్టణానికి చెందిన ఓ మైనర్ బాలికపై లైంగికదాడి జరిగింది. ఈ కేసులో యువకుడిని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ దత్తాద్రి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మపురికి చెందిన ఓ యువకుడు కొల్లూరి అర్జున్ మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి పట్టణశివారు ప్రాంతానికి తీసుకువెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. సదరు బాలికకు రక్తస్రావం ఎక్కువ కావడంతో గమనించిన తల్లి విషయం అడగడంతో జరిగిన దారుణాన్ని తెలిపింది. దీంతో వెంటనే చికిత్స కోసం దవాఖానకు తరలించగా, జగిత్యాల దవాఖానలో చికిత్స పొందుతున్నది. మంగళవారం బాలిక తల్లి చేసిన ఫిర్యాదు మేరకు డీఎస్పీ వెంకటస్వామి రంగంలోకి దిగి విచారణ జరిపి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వివరించారు.

5న జాతర టెండర్లు

సారంగాపూర్, జనవరి 30: బీర్‌పూర్ మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ నర్సింహ స్వామి ఆలయ ఆవరణలో జాతర టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 19 నుంచి మార్చి 2 వరకు జరిగే జాతరలో వివిధ దుకాణాల నిర్వహణకు టెండర్లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

రాయికల్, జనవరి 30: రాయికల్-జగిత్యాల రోడ్ బీడీ ఆఫీస్ ఎదురుగా అక్రమ నిర్మాణాన్ని ఎక్స్‌కవేటర్‌తో అధికారులు కూల్చివేయించారు. కార్యక్రమంలో కమిషనర్ గంగుల సంతోష్ కుమార్, మేనేజర్ వెంకట్ హరీశ్, రజాక్, రాజు కుమార్ పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశం వాయిదా

రాయికల్, జనవరి 30: మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం జరగాల్సిన సాధారణ సమావేశం కోరం లేనందున వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ సంతోష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌తోపాటు కౌన్సిల్ సభ్యులు ఎవరూ హాజరుకాకపోవడంతో వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ ఫ్లెక్సీ ధ్వంసం

వెల్గటూర్, జనవరి 30: మండల కేంద్రంలోని బస్టాండ్ దగ్గర బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇక్కడ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జూపాక కుమార్, నాయకులు తదితరులు ఉన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

మల్లాపూర్, జనవరి 30: సాతారం, రాఘవపేట, సిరిపూర్, మల్లాపూర్ గ్రామాల్లోని ఎరువులు దుకాణాలను వ్యవసాయ శాఖ ఏడీఏ రమేశ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, ఎరువుల నిల్వలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

ప్రత్యేకాధికారుల నియామకం

సారంగాపూర్, జనవరి 30: గ్రామాల్లో సర్పంచుల పదవీ కాలం జనవరి 31తో ముగుస్తున్నందున ప్రభుత్వం ఆయా గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించింది. రేచపల్లికి ఎంపీడీవో రాజేందర్, అర్పల్లికి ఎంపీవో శశికుమార్ రెడ్డి, పెంబట్లకు ఎంఈవో ఆంజనేయులు, లక్ష్మీదేవిపల్లికి సూపర్‌వైజర్ లత, కోనాపూర్‌కు ఏఈ పీఆర్ భూపతి, పోతారానికి తహసీల్దార్ రమేశ్, రంగపేటకు హాస్టల్ వార్డెన్ మహేందర్ సింగ్, సారంగాపూర్‌కు ఆర్ఐ భాస్కర్ రావు, నాగునూర్‌కు ఏఈ అనిల్, లచ్చుక్కపేటకు ఆర్ఐ కృష్ణ, లచ్చనాయక్ తండాకు ఏఈ రాజశేఖర్, పోచంపేట్‌కు డిప్యూటీ తహసీల్దార్ లాస్యశ్రీ, బట్టపల్లికి ఏఈవో వెంకటేశ్, మ్యాడారం తండాకు డిప్యూటీ రేంజర్ రవి కుమార్, ఒడ్డెరకాలనీకి ఏవో తిరుపతి నాయక్, ధర్మనాయక్ తండాకు హెల్త్ సూపర్‌వైజర్ ముకుద్దుస్, నాయకపు గూడెంకు సూపరింటెండెంట్ పద్మలత, భీంరెడ్డి గూడెంకు జూనియర్ అసిస్టెంట్ నవీన్‌ను స్పెషల్ అధికారులుగా నియమించారు.

కొడిమ్యాల, జనవరి 30: మండలంలోని 24 గ్రామాలకు ప్రత్యేకాధికారులను నియమించినట్లు ఎంపీవో ప్రవీణ్ తెలిపారు. కొడిమ్యాలకు తహసీల్దార్ రవికాంత్, పూడూర్‌కు డీటీ కృష్ణ, నాచుపల్లికి ఎంపీవో ప్రవీణ్, చెప్యాల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మణిదీప్, నమిలకొండకు ఎంపీడీవో పద్మజారాణి, తిప్పాయిపల్లికి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ (మిషన్ భగీరథ) హరిప్రసాద్, తిర్మలాపూర్‌కు పశువైద్యాధికారి శ్రీకాంత్, రామకిష్టాపూర్‌కు పంచాయతీరాజ్ ఏఈ చంద్రశేఖర్, నల్లగొండకు పశువైద్యాధికారి పల్లె ప్రసాద్, డబ్బుతిమ్మాయిపల్లికి వ్యవసాయాధికారి పర్లపల్లి జ్యోతి, శ్రీరాములపల్లికి సూపరింటెండెంట్ సురేందర్, కోనాపూర్‌కు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధారాణి, కొండాపూర్‌కు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమ, రామ్‌సాగర్‌కు ఏఈవో శ్రీలత, అప్పారావుపేట, ఏఈవో గ్రీష్మ, హిమ్మత్‌రావుపేట ఏఈవో మంజుల, దమ్మయ్యపేటకు ఏఈవో శ్రీనివాస్, సూరంపేటకు సీనియర్ అసిస్టెంట్ (రెవెన్యూ) చంద్రిక, గౌరాపూర్‌కు ఆర్ఐ రవీందర్, గంగారాంతండాకు సీనియర్ అసిస్టెంట్ (పంచాయతీరాజ్) బీ సురేశ్, తుర్కాశీనగర్‌కు జూనియర్ అసిస్టెంట్ (పంచాయతీరాజ్) నిఖిల, చింతల్లపల్లికి జూనియర్ అసిస్టెంట్ (రెవెన్యూ) మహ్మద్ సాజిద్, నర్సిహులపల్లికి జూనియర్ అసిస్టెంట్ (రెవెన్యూ) గంగారాం, శనివారంపేటకు టైపిస్టు (పంచాయితీరాజ్) అరుణ్‌చంద్రను ప్రత్యేకాధికారులుగా నియమించినట్లు చెప్పారు.

వ్యవసాయ మోటర్ల దొంగల అరెస్ట్

మెట్‌పల్లి రూరల్, జనవరి 30: వ్యవసాయ మోటర్లు, ట్రాక్టర్ ట్రాలీ చోరీ నిందితులు పోలీసులకు చిక్కారు. మంగళవారం మెట్‌పల్లి పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రవీందర్‌రెడ్డి మాట్లాడారు. పాటిమీది తండాకు చెందిన గుగ్లావత్ నరేశ్, జరుపుల ప్రకాశ్, గుగ్లావత్ రవిలాల్, గుగ్లావత్ అనిల్ జల్సాలకు అలవాటుపడ్డారు. ఈ క్రమంలో మోటర్ల దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. మొదటిసారిగా గత నవంబర్ 10న ఆత్మకూర్‌లో మోటర్ల దొంగతనానికి వెళ్తుండగా, రోడ్డు పక్కన నిలిపి ఉంచిన ఖాళీ ట్రాక్టర్ ట్రాలీని గమనించి దొంగిలించారు. అప్పుడు ఎన్నికల సమయం కావడంతో పోలీస్ పెట్రోలింగ్ ఎక్కువగా ఉంటుందని, ట్రాలీని తర్వాత అమ్ముదామని భావించి, ఎవరికీ అనుమానం రాకుండా ఆత్మకూర్ గ్రామ శివారులోని పొలాల వద్ద గల పొదల్లో దానిని దాచిపెట్టారు. తర్వాత గత డిసెంబర్ 24న ఆత్మకూర్ శివారులోని వ్యవసాయ బావి వద్ద రెండు మోటర్లు, అనంతరం 12 రోజులకు మల్లాపూర్ మండలం రాఘవపేట గ్రామ శివారులోని రోడ్డు పక్కన గల మరో నాలుగు వ్యవసాయ మోటర్లను దొంగిలించారు. అంతటితో ఆగకుండా ఈనెల 10న వెల్లుల్ల గ్రామ శివారులోని వ్యవసాయ బావి వద్ద రెండు మోటర్లు, ఈనెల 23న ఆత్మకూర్ శివారులోని పెద్దవాగు సమీపంలో మూడు వ్యవసాయ మోటర్లను దొంగిలించారు. ఈ మోటర్లను ట్రాక్టర్ ట్రాలీ వద్ద దాచి, అన్నింటినీ కలిపి ఎవరికీ అనుమానం రాకుండా అమ్ముదామనుకున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ట్రాక్టర్ ట్రాలీలో మోటర్లన్నింటినీ ఎక్కించుకొని నిజామాబాద్‌లో విక్రయించేందుకు బయలుదేరారు. మార్గమధ్యంలో వెల్లుల్ల శివారులోని జగ్గాసాగర్ ఎక్స్ రోడ్డు వద్ద పోలీసులు వీరిని పట్టుకొని, ట్రాక్టర్ ట్రాలీ, 11 వ్యవసాయ మోటర్లన్నింటినీ స్వాధీనం చేసుకున్నారు. అలాగే వీరిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ చిరంజీవి ఉన్నారు.

కార్యదర్శి, సర్పంచ్, ఉప సర్పంచ్ విధుల నుంచి తొలగింపు

ఉత్తర్వులు జారీ చేసిన డీపీవో

పెగడపల్లి, జనవరి 30: నామాపూర్ పంచాయతీ కార్యదర్శి తిరుపతి, సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ సంతోష్‌ను విధుల నుంచి తాత్కాలికంగా తొలగిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామంలో బోర్‌వెల్స్‌కు సంబంధించిన నిధులు జీపీ నుంచి అక్రమంగా డ్రా చేసుకున్నారని గ్రామానికి చెందిన ముదుగంటి నవీన్‌రెడ్డి ఫిర్యాదు చేయగా, వారం క్రితం పంచాయతీ అధికారులు విచారణ చేపట్టారు. నిధుల దుర్వినియోగం జరిగినట్లు విచారణలో తేలడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు వారిని తాత్కాలికంగా విధుల నుంచి తొలగిస్తున్నట్లు డీపీవో ఉత్తర్వులు జారీ చేశారు.

కోరుట్ల పట్టణంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు జీఎస్ గార్డెన్‌లో మంగళవారం ఫేర్‌వెల్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. – కోరుట్ల, జనవరి 30: